క్లుప్తంగా

రైతులకు స్ప్రేయర్లు పంపిణీ



రైతులకు సబ్సిడీ స్ప్రేయర్లు అందిస్తున్న సర్పంచ్, ఏఓ

ఉరవకొండ: మండలంలోని రేణుమాకుపల్లి సచివాలయ పరిధిలో వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద రైతుసంఘాలకు 40 శాతం సబ్సిడీతో స్ప్రేయర్లు బుధవారం పంపిణీ చేశారు. సర్పంచ్ రామాంజనేయులు, జేఓ శశికళ చేతుల మీదుగా పలు రైతు సంఘాలకు అందించారు. ఏఓ శశికళ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా రైతు సంఘాలకు యంత్ర సేవా పథకం ద్వారా పరికరాలు అందించామన్నారు.

విద్యార్థులు సేవా గుణాన్ని అలవర్చుకోవాలి

కూడేరు: విద్యార్థులు చిన్నతనం నుంచే సేవా గుణాన్ని అలవర్చుకోవాలని గ్రంథాలయాధికారిణి రాధారాణి తెలిపారు. బుధవారం సమ్మర్ క్యాంపు కార్యక్రమంలో భాగంగా కూడేరు గ్రంథాలయంలో విద్యార్థులకు 'మంచి అలవాట్లు – ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడం' అనే అంశాలపై గ్రంథాలయాధికారిణి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది రంగయ్య, పిల్లల తల్లిదండ్రులు, పాఠకులు పాల్గొన్నారు.

అంజుమన్ కమిటీ చేయూత



పెళ్లి కుమార్తె తల్లిదండ్రులకు ఆర్థిక సాయం అందిస్తున్న అంజుమన్ కమిటీ సభ్యులు

రాయదుర్గంటౌన్: పేద కుటుంబాలకు చెందిన ఆడబిడ్డల వివాహానికి రాయదుర్గం అంజుమన్ అజ్మతుల్ ఇస్లాం కమిటీ అండగా నిలిచింది. ఐదుగురు పేదింటి అమ్మాయిల పెళ్లికి ఒక్కొక్కరికి రూ. 7 వేల చొప్పున ఆర్థిక సాయం మంగళవారం అందించింది. అంజుమన్ కమిటీ కార్యాలయంలో పెళ్లి కుమార్తెల తల్లిదండ్రులను పిలిపించి, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు బ్రెడ్ సర్మాస్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు బాషా, కార్యదర్శి మహమ్మద్ షఫీ, సహాయ కార్యదర్శి హుజేఫా, కోశాధికారి అహ్మద్ హుస్సేన్, కమిటీ సభ్యులు డ్రైవర్ బాషా, ఖాసీం, ఉమ్రలీ, రజాక్, షేక్ జాకీర్, షాకీర్ పాల్గొన్నారు.

లింగ వివక్ష చూపడం చట్టరీత్యా నేరం



పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

విడపనకల్లు: లింగ వివక్ష చట్టరీత్యా నేరమని ఎంపీపీ కరణం పుష్పావతి తెలిపారు. బుధవారం గడేకల్లు గ్రామంలో ఆరోగ్య, ఐసీడీఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రంలో లింగ వివక్ష నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఎంపీపీ మాట్లాడుతూ సమాజంలో ఆడ, మగ అనే తేడా చూపరాదన్నారు. అనంతరం లింగ వివక్ష పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో సర్పంచు సుశీల, ఏఎస్ఎం సుగుణ, ఫర్హాన్, అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతోనే సమస్యల పరిష్కారం

కూడేరు: మండల ప్రజల సమస్యల పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేద్దామని ఎంపీడీఓ ముస్తఫా కమల్‌బాషా పిలుపు నిచ్చారు. బుధవారం ఉదిరిపికొండలో మండల స్థాయిలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి, ఇంకా ఎవరికైనా వర్తించకపోతే వారికి లబ్ధి కలిగేలా కృషి చేద్దామని అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ శేఖర్, పీఆర్ ఏఈ శ్రీనివాసులుతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

తాగునీరు వృథా



వృథాగా పోతున్న తాగునీరు

కూడేరు: పైపులైన్ దెబ్బతిని తాగునీరు వృథాగా పోతున్నా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకోలేదని జల్లిపల్లి, పి.నారాయణపురం గ్రామాల ప్రజలు అంటున్నారు. పీఏబీఆర్ డ్యాం వద్ద నుంచి సీపీడబ్ల్యూఎస్ పథకం కింద గ్రామాలకు తాగునీరు సరఫరావుతోందన్నారు. పలు చోట్ల పైపులైన్ దెబ్బతిని, లీకేజీలు ఏర్పడి రెండు నెలలుగా తాగునీరు వృథాగా పోతోందన్నారు. నీరు వృథాగా పంట పొలాలకు పోతుంటే దెబ్బ తింటున్నాయని అన్నారు.

పేదలకు అండగా జగనన్న ప్రభుత్వం

- గడప గడపకూ మన ప్రభుత్వంలో మంత్రి ఉషశ్రీచరణ్



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్, స్థానిక నాయకులు

కంబదూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేద బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలను అందించి, అండగా నిలుస్తోందని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ అన్నారు. బుధవారం మండలంలోని నూతిమడుగు పంచాయతీలోని సీవీ తండా గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన మంత్రికి స్థానిక నాయకులు, గ్రామస్తులు స్వాగతం పలికారు.

గడప గడపకూ వెళ్లి సంక్షేమ లబ్ధిపై ఆరా...

ఈ సందర్భంగా మంత్రి ప్రతి ఇంటి వద్దకు వెళ్లి జగనన్న ప్రభుత్వం ద్వారా కుటుంబానికి అందిన లబ్ధిపై ఆరా తీశారు. రాబోవు రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అందించడానికి సీఎం జగనన్న కృషి చేస్తున్నారని మంత్రి అన్నారు. గ్రామాల్లో సాంకేతిక సమస్యలతో ఎక్కడైనా పథకాలు అందకపోతే వెంటనే వాటిని పరిష్కరించాలని సచివాలయ సిబ్బందికి మంత్రి సూచించారు. ఎప్పటికప్పుడు సచివాలయ సిబ్బంది సమస్యల రిజిష్టర్‌ను ప్రత్యేకంగా తయారు చేసుకోవాలన్నారు. సీఎం జగన్ కుల, మతాలకతీతంగా, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారని గుర్తు చేశారు. రాబోవు రోజుల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మనమంతా మద్దతుగా నిలవాలని సూచించారు. మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవడానికి ప్రజలు అండగా నిలవాలని మంత్రి కోరారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు సచివాలయ సిబ్బంది నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర జానపద, సృజనాత్మకత అకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి, జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి ములకనూరు గోవిందు, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ రామ్మోహన్ యాదవ్, మర్రిమాకులపల్లి సర్పంచు బాపూజీ, సీనియర్ నాయకుడు రాజగోపాల్, మాజీ సర్పంచు ప్రమీలమ్మ, సచివాలయ కన్వీనర్ నాగరాజు, వైస్ సర్పంచ్ నాగేంద్ర, నాయకులు రఘు, వైఎస్ రమేష్ పాల్గొన్నారు.



సీఎం సహాయ నిధి చెక్కు అందిస్తున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

కళ్యాణదుర్గం: స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ కుందుర్పి జెడ్పీటీసీ రాధాస్వామికి మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కును బుధవారం అందించారు. కుందుర్పి జెడ్పీటీసీ రాధాస్వామి అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేయించుకున్నారు. ఆయనకు మంజూరైన రూ.1.48 లక్షల సీఎం సహాయ నిధి చెక్కును మంత్రి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సత్యనారాయన శాస్త్రి, మార్కెట్ యార్డు డైరెక్టర్ లింగప్ప, నాయకులు బొమ్మలింగ, శ్రీనివాసులు, వెంకటేశులు పాల్గొన్నారు.

కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలి



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

- ప్రభుత్వ విప్ కాపురామచంద్రారెడ్డి, ఎంపీ తలారి రంగయ్య

బొమ్మనహాళ్: ప్రతి ఒక్కరూ కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలని పభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీ తలారి రంగయ్య అన్నారు. మండలంలోని ఉద్దేహాళ్ జెడ్పీహెచ్ఎస్‌లో పుష్పగిరి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని పభుత్వ విప్ కాపు, ఎంపీ రంగయ్య ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ సర్వేంద్రియాల్లో కళ్లు ప్రధానమైనవని అన్నారు. పేదలకు కంటి చూపును అందించే దిశగా శంకర్ ఆస్పత్రి గ్రామీణ ప్రాంతాల్లో సేవలు అందిస్తోందన్నారు. 142 మందికి కంటి పరీక్షలు చేయగా, అదులో 96 మందిని కంటి ఆపరేషన్లకు పంపిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ రమేష్, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, జయరామ్‌రెడ్డి, గాధిలింగ, అనంతరాజు, వీరన్నగౌడ్, కృష్ణ, వన్నల్లి రామాంజనేయులు, రామకృష్ణ, వన్నూరుస్వామి, సర్మాస్, బసవరాజు, శీన, నాగరాజు, రవి, వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును చూస్తే కరువు గుర్తొస్తుంది

రాయదుర్గం: టీడీపీ అధినేత చంద్రబాబును చూడగానే 2014- 2019 మధ్య కరువు పరిస్థితులు గుర్తొస్తాయని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం విప్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బాబు, కరువు కవలల్లాంటి వారన్నారు. ఆయన ఉన్నంత కాలం చినుకు జాడలేక తాగునీటి కోసం ప్రజలు, సాగునీటి కోసం రైతులు అల్లాడిపోయారన్నారు. చంద్రబాబు, ఆయన కొడుకు లోకేష్ మళ్లీ ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమయ్యారన్నారు.

జగన్ సీఎం అయ్యాకే పేదల బతుకుల్లో వెలుగు..

వైఎస్ జగన్ సీఎం అయిన తర్వాతనే వర్షాలు సమృద్ధిగా కురుస్తున్న పరిస్థితిని రైతులు కళ్లారా చూస్తున్నారని విప్ అన్నారు. అప్పట్లో భూగర్భజలాలు అడుగంటడంతో రైతులు వ్యవసాయం చేసుకోలేని పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం ఎక్కడ చూసినా నీరు సమృద్ధిగా ఉందన్నారు. జలాశయాలు, కుంటలు, చెరువులు పొంగిపొర్లుతున్నాయన్నారు.

'కాలవ' కుట్రలు ప్రజలకు తెలుసు..

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు సంపాదన కోసమే రాయదుర్గానికి వలస వచ్చాడని విప్ కాపు విమర్శించారు. కరోనా వస్తే ప్రజల బాగోలు మరచి కాలవ అనంతకు, బాబు హైదరాబాద్ కు పారిపోయి దాక్కున్నారన్నారు. ఇలాంటి ద్రోహులు ప్రజలకు ఏం మేలు చేస్తారో చెప్పాలన్నారు. కాలవ చేసే నీచ రాజకీయలు, కుట్రలను ప్రజలెవరూ విశ్వసించడంలేదన్నారు. అన్ని వేళలా తాము ప్రజా సంక్షేమానికే పాటుపడుతున్నామన్నారు. బాబు, కాలవకు 2024 ఎన్నికలే ఆఖరివి అన్నారు.

ఘనంగా కుంటమారెమ్మ విగ్రహ ప్రతిష్ట



విశ్వేశ్వరరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు



కుంట మారెమ్మదేవికి పూజలు చేస్తున్న దృశ్యం

విడపనకల్లు: మండలంలోని డొనేకల్లులో కుంట మారెమ్మ ఆలయం పునర్నిర్మాణం ,విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం బుధవారం నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున నుంచి కుంటమారెమ్మ దేవికి వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కరణం పుష్పావతి, జెడ్పీటీసీ హనుమంతు, వైఎస్సార్‌సీపీ నాయకులు మార్కెట్ యార్డు డైరెక్టర్ కురుబ రమేష్, భీంరెడ్డి, వీరభద్రి, తదితరులు పాల్గొన్నారు.

మరింత బాధ్యతగా పనిచేయాలి

వజ్రకరూరు: అంగన్‌వాడీ ఉద్యోగాలు పొందిన వారు పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం ఉరవకొండలో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డిని చాయాపురం అంగన్‌వాడీ ఆయా కె.శోభారాణి, గ్రామ సచివాలయ కన్వీనర్ దరూరు రమేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఓబుళేసు, కొండూరు సురేష్, ఎంసీ వెంకటేష్, పత్తిపాటి రమేష్, నరసింహులు, రాజేంద్ర, తదితరులు సన్మానించారు.

శుభకార్యం

ఉరవకొండ రూరల్: మండలంలోని చిన్నముష్టూరు గ్రామానికి చెందిన గొర్ల పోతన్న కుమారుడి వివాహం బుధవారం అదే గ్రామంలో జరిగింది. ఈ వివాహ వేడుకకు నియోజకవర్గం ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి హాజరయ్యారు. నూతన వధూవరులు మల్లేష్, మాధవీలతను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రామాంజనేయులు, బాబు, సుంకన్న తదితరులు హాజరయ్యారు.

నేడు విద్యుత్ ఉపకేంద్ర ఏర్పాటుకు భూమిపూజ

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్ల నుంచి ఛాయాపురం గ్రామానికి వెళ్లె దారిలో గురువారం ఉదయం 9 గంటలకు 33–11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణానికి భూమిపూజ చేయనున్నట్లు ఎంపీపీ రమావత్‌దేవి, జేసీఎస్ మండల కన్వీనర్ రాచన్నగౌడ్, ట్రాన్స్‌కో ఏఈ చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం వజ్రకరూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. భూమిపూజకు ఎమ్మెల్సీ వై.శివ రామిరెడ్డి, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై. విశ్వేశ్వరరెడ్డి తదితరులు హాజరు కానున్నట్లు వారు వెల్లడించారు. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా మొత్తం రూ.3 కోట్ల వ్యయంతో విద్యుత్ ఉపకేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు. విద్యుత్ ఉపకేంద్రం ఏర్పాటుతో కొనకొండ్ల, గూళ్యపాళ్యం, కమలపాడు, పొట్టిపాడు, కమలపాడుతండా తదితర గ్రామాలతోపాటు మరికొన్ని గ్రామాలకు నాణ్యమైన విద్యుత్ అందించడంతో పాటు లోటల్టేజీ సమస్య తీరనున్నట్లు తెలిపారు.


బొమ్మనహాళ్ ఎస్ఐకు ప్రశంస



డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ శ్రీనివాసరావు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఎస్ఐ శివ

బొమ్మనహాళ్: విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బొమ్మనహాళ్ ఎస్ఐ జి.శివను డీఐజీ ఆర్ఎన్ అమ్మిరెడ్డి, ఎస్పీ శ్రీనివాసరావు అభినందించారు. గత నెల 17న ఉద్దేహాళ్ గ్రామంలోని ఎయిర్‌టెల్ సెల్‌టవర్‌కు సంబంధించిన రూ. 3.75 లక్షలు విలువ చేసే 24 బ్యాటరీలను చోరీ చేసిన ముఠాను ఎస్ఐ శివ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. డీఐజీ, ఎస్పీ అభినందించారు.

పథకాలు సక్రమంగా అందించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

బొమ్మనహాళ్: సంక్షేమ పథకాలు పేదలకు సక్రమంగా అందేలా చూడాలని తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో షకీలాబేగం అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లకు ఏపీ సర్వీసుల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ విజయమ్మ పాల్గొన్నారు.

ఖరీఫ్ సీజన్‌లో సాగు నీరందించండి

గుమ్మఘట్ట: భైరవానితిప్ప ప్రాజెక్టు కింద ఉన్న ఆయకట్టుకు ఖరీఫ్ సీజన్‌లో నీరు అందించాలని జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్ జిల్లా కలెక్టర్ గౌతమికి విన్నవించారు. బుధవారం రాయదుర్గం ఆర్అండ్‌బీ అతిథిగృహంలో కలెక్టర్‌కు మండల కన్వీనర్ మంజునాథతో కలిసి ఆయన వినతిపత్రం అందించారు. మండల వ్యాప్తంగా ఉన్న చెరువులకు మరమ్మతు పనులు చేసేందుకు అనుమతులు మంజూరు చేయాలని కోరారు.

బాల్య వివాహాలపై అనర్థాలు తెలుసుకోవాలి

- జిల్లా పరిషత్ సీఈఓ భాస్కర్‌రెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి

ఉరవకొండ: బాల్య వివాహలతో జరిగే అనర్థాలపై అవగాహన కల్పించడంతోపాటు వాటిని అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బాల్యవివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీఓ చంద్రమౌళి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెడ్పీ సీఈఓ మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల జరిగే అనర్థాలను ప్రజలకు వివరించి, ప్రభుత్వం నిర్ణయించిన వయస్సును వారికి తెలియజేయాలన్నారు. ఎంపీపీ చందాచంద్రమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బాల్యవివాహలను అరికట్టడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరపడానికి సిద్ధం అయితే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ షాబుద్దీన్, ఏడీఏ పద్మజ, వైస్ ఎంపీపీ నరసింహులు, ఎంఈఓ ఈశ్వరప్ప, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఆధార్ సేవా కేంద్రం ఏర్పాటు



కూడేరులో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రం

కూడేరు: మండల కేంద్రంలోని సచివాలయం-2లో ఆధార్ సేవా కేంద్రాన్ని బుధవారం ఎంపీడీఓ ముస్తఫా కమల్ బాషా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పుట్టిన తేదీ, అడ్రస్, పేర్లు మార్పులు, చేర్పులు , ఆధార్ అప్‌డేట్, ఆధార్‌కు మొబైల్ లింక్‌తో పాటు మరికొన్ని సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రఘు, ఆధార్ సెంటర్ ఆపరేటర్ పావని పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : మండలంలోని వెస్ట్ కోడిపల్లి గ్రామ సచివాలయంలో ఆధార్ సీడింగ్ సేవలు నిర్వహించినట్లు ఎంపీడీఓ వెంకటనాయుడు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఇక నుంచి అన్ని గ్రామ సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహించి, ప్రజలకు సేవలు అందించనున్నట్లు తెలిపారు.

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడండి

గుంతకల్లు రూరల్: గ్రామంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా క్వార్ట్జ్(మైనింగ్) తవ్వకాలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఖేతన్‌గార్గ్ కంపెనీ ప్రతినిధులకు సూచించారు. పాతకొత్తచెరువులో సర్వే నంబర్ 40లో 18.266 హెక్టార్ల విస్తీర్ణంలో క్వార్ట్జ్ తవ్వకాల కోసం కృష్ణసాయి కంపెనీ ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుంది. బుధవారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలో మౌలిక వసతులు, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని జేసీ కంపెనీ ప్రతినిధులకు సూచించారు. తవ్వకాలకు వెళ్లే వాహనాల కోసం ప్రత్యేక రహదారిని ఏర్పాటు చేసుకోవాలని తెలియజేశారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ శంకర్రావు, ఎంపీపీ బీవీ మాధవి, సర్పంచ్ మల్లికార్జున, ఎంపీటీసీ వెంకటరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుతో సుస్థిరాభివృద్ధి

- ఏపీడీ జయకుమార్‌బాబు వెల్లడి



మామిడి సాగు చేసిన రైతులతో మాట్లాడుతున్న ఏపీడీ జయకుమార్‌బాబు

రాయదుర్గం: పళ్లతోటల పెంపకంతోనే రైతులకు సుస్థిరాభివృద్ధి సాధ్యమని ఉపాధి పథకం ఏపీడీ జయకుమార్‌బాబు తెలిపారు. బుధవారం రాయదుర్గం మండలం రేకులకుంటలో మామిడితోటను సందర్శించి, రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం ఏపీడీ విలేకరులతో మాట్లాడారు. 5 ఎకరాల్లోపు ఉన్న చిన్న, సన్న కారు రైతులందరికీ ఉపాధి పథకం ద్వారా పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహకం అందిస్తోందన్నారు. పండ్ల తోటల రకాలను బట్టి ఎకరాకు సుమారు రూ.1,01,241 నుంచి రూ.2,48,845 వరకు ప్రభుత్వం చెల్లిస్తోందని తెలిపారు. ఇలా మూడేళ్లపాటు సంరక్షణ మొదలు, నీరు పెట్టే వరకే ప్రభుత్వమే ఖర్చులన్నీ భరిస్తోందన్నారు.

ఓబయ్య జయంతి వేడుకలు

కుందుర్పి: మండల కేంద్రంలో స్వాంతంత్ర్య సమరయోధుడు, మాజీ సమితి అధ్యక్షుడు కంబదూరు ఐ.ఓబయ్య జయంతి వేడుకలను వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం నిర్వహించారు. ముందుగా ఓబయ్య చిత్ర పటానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో ఓబయ్య కుమారుడు ఐ.సుదీర్, జెడ్పీటీసీ రాధాస్వామి, ఎంపీపీ కమలమ్మ, మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి, మాజీ జెడ్పీటీసీ రాజగోపాల్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ లింగప్ప, సర్పంచులు మారుతేశ్వరి, హసీనాబి, సీనియర్ నాయకుడు పెద్ద ఓబుళేసు పాల్గొన్నారు.

22 నుంచి సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ

వజ్రకరూరు: ఈనెల 22 నుంచి రాయితీ వేరుశనగ విత్తనాల పంపిణీ ప్రారంభం కానున్నట్లు ఏఓ మధుకర్ తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఈనెల 16 నుంచి విత్తన కాయల కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. కే6 అనే రకంతోపాటు లేపాక్షి రకం వేరుశనగ విత్తనకాయలు అందిస్తున్నట్లు తెలిపారు. అర ఎకరం పొలం ఉన్న రైతుకు ఒక బ్యాగు, ఎకరా ఉన్న రైతులకు రెండు, బ్యాగులు, ఆపైన ఉన్న రైతులకు మూడు బ్యాగులు విత్తనకాయలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

పండ్లతోటల సాగుకు అర్హులను ఎంపిక చేయాలి

- డ్వామా ఏపీడీ అనురాధ



కూడేరు: మాట్లాడుతున్న ఏపీడీ అనురాధ

కూడేరు: ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకం కింద అర్హులైన చిన్న, సన్నకారు రైతులను ఎంపిక చేయాలని బుక్కరాయసముద్రం క్లస్టర్ ఏపీడీ అనురాధ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆమె కూడేరులోని ఉపాధి కార్యాలయంలో ఉపాధి పనుల కల్పన, కూలీల సంఖ్య పెంపు, పండ్లతోటల పెంపకానికి సంబంధించి రైతుల ఎంపికపై మండల సిబ్బందితో సమీక్షించారు. ఈ నెల 30లోపు పండ్లతోటల పెంపకానికి రైతులు దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. అంతకుముందు ఆమె జల్లిపల్లి, కొర్రకోడు గ్రామాల్లో జరుగుతున్న కందకాలు, కాలువలో పూడిక తీత పనులను పరిశీలించారు. టీఏలు లక్ష్మీనారాణ, జనార్ధన్, షెక్షా, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరాలి

శెట్టూరు: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం నుంచి లబ్ధి చేకూరాలని ప్రత్యేకాధికారి దామోదర్ సూచించారు. బుధవారం శెట్టూరు గ్రామ సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. అన్ని శాఖల అధికారులతో సమీక్షించారు. రెవెన్యూ, మండల పరిషత్, ఐసీడీఎస్, హౌసింగ్, వ్యవసాయ శాఖ తదితర శాఖల ద్వారా జరిగిన వివిధ అభివృద్ధి పనులపై ఆరా తీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫణికుమార్, ఎంపీడీఓ గంగావతి, సూపర్ వైజర్ రాధ, ఏపీఓ రమేష్, ఎంఈఓ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

భారతి సిమెంట్ వినియోగంపై అవగాహన

రాయదుర్గం: అత్యుత్తమ కట్టడాలకు భారతి సిమెంట్ ఎంతగానో ఉపయోగ పడుతుందని కంపెనీ డిప్యూటి మేనేజర్ కిరణ్‌కుమార్ అన్నారు. బుధవారం డీహీరేహాళ్‌లో భారతి సిమెంట్ నాణ్యత పై తాపీ మేస్త్రీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేనేజర్ మాట్లాడుతూ భారతి సిమెంట్ రోబోటెక్ టెక్నాలజీతో తయారు చేయబడిందన్నారు. స్లాబ్‌కు అనుకూలమైన సిమెంట్ అని గుర్తు చేశారు. ఈ సందర్భంగా తాపీ మేస్త్రీలకు రూ.లక్ష విలువ చేసే ఉచిత ప్రమాద బీమా బాండ్లు అందించారు. ఈకార్యక్రమంలో టెక్నికల్ ఇంజనీర్ మోతీలాల్‌నాయక్, డీలర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో బతుకు చిద్రం

శెట్టూరు: బాల్య వివాహాలతో బాలికల బతుకులు చిద్రమవుతున్నాయని ఎంపీడీఓ గంగావతి, సూపర్ వైజర్ రాధ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాయలంలో వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, బాలికల తల్లిదండ్రులకు బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతిచెందిన వడ్డే చిన్నప్పయ్య

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్ల సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వడ్డే చిన్నప్పయ్య (35) మృతిచెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు.. పాత గుంతకల్లుకు చెందిన వడ్డే చిన్నప్పయ్య, వడ్డే ఆంజనేయులు ద్విచక్ర వాహనంపై గుంతకల్లుకు బయల్దేరారు. మార్గంమధ్యలో కొనకొండ దాటిన తర్వాత గుంతకల్లునుంచి వజ్రకరూరు వైపు వెళ్తున్న ఆటో ఢీకొనింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చిన్నప్పయ్య, వడ్డే ఆంజనేయులును 108 వాహనంలో గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే వడ్డే చిన్నప్పయ్య మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వజ్రకరూరు ఏఎస్ఐ వేణుగోపాల్, వజ్రకరూ రు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వేణుగోపాల్ తెలిపారు.